ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 19.01.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు మేడారంలో అభివృద్ధి చేసిన వనదేవతల గద్దెలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మంత్రులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.
2. స్విట్జర్లాండ్‌లోని డావోస్‌లో ఈరోజు నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ ఆర్థిక సదస్సు కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరుకానున్నారు.
3. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.
4. సింగరేణిని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుంటోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు.

---------------------------

**ముఖ్యమంత్రి - మేడారం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారంలో అభివృద్ధి చేసిన వనదేవతల గద్దెలను ఈరోజు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని ముఖ్యమంత్రి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, శాసనసభ్యులు పాల్గొన్నారు.

**డెస్క్**

-------------------------

**మంత్రివర్గ సమావేశం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిన్న రాత్రి మేడారంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. వచ్చే ఏడాది జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది. బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి నది వెంబడి ఉన్న అన్ని ప్రధాన, పురాతన దేవాలయాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రివర్గం నిర్ణయిచింది. వచ్చే ఏడాది పుష్కరాలు నేపథ్యంలో పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.

అలాగే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మెట్రో రైలు ఫేజ్-2 కోసం 2 వేల 787 కోట్ల రూపాయల విలువైన భూసేకరణ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదించింది. సమావేశం తర్వాత మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వీలైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు.

**<u>బైట్ - పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి</u>**

**డెస్క్**

-----------------------------

**సీతక్క**

మేడారంలో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ములుగు జిల్లాకు గోదావరి నీరందించేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.ఈ ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.....

**<u>బైట్ సీతక్క</u>**

**పీటీసీ – ములుగు**

---------------------------

**పొన్నం ప్రభాకర్..**

సమ్మక్క సారలమ్మలను చారిత్రక గిరిజన దేవతలుగా భావిస్తారని, కుంభమేళా మాదిరిగానే ఇక్కడ చాలా సంవత్సరాలుగా ఒక గొప్ప ఉత్సవం జరుగుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారంలో ఈరోజు మీడియాతో మంత్రి మాట్లాడుతూ... మేడారం జాతరకు ప్రతి ఏడాది లక్షలాది మంది హాజరవుతారని తెలిపారు. సమ్మక్క సారక్క విగ్రహాల దర్శనం కోసం హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**డెస్క్**

-----------------------

**మేడారం జాతర..**

మేడారం సమ్మక్క, సారక్క మహాజాతరను దక్షిణాది కుంభమేళా స్థాయిలో ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిన్న రాత్రి మేడారంలో ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలను ఆయన వీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కాకతీయుల కత్తికి ఎదురు నిలిచిన సమ్మక్క-సారలమ్మల ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యం వనజాతరగా ఆవిష్కృతమైందని ముఖ్యమంత్రి అన్నారు.

**డెస్క్**

---------------------------

**దావోస్...**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రతినిధి బృందం ఈ రోజు స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు బయలుదేరింది. ఇవాల్టి నుంచి ఈ నెల 23 వరకు దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొని రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేయనుంది. సదస్సులో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్–2047 ఉద్దేశాలు, లక్ష్యాలకు విస్తృత ప్రచారం కల్పించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ,

తెలంగాణ ఏఐ హబ్‌ను అక్కడ ఆవిష్కరించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించిన విజన్ డాక్యుమెంట్ దార్శనికత, రాష్ట్రాభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ పేరుతో రూపొందించిన ప్రణాళికలు, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను దావోస్ సదస్సులో రాష్ట్ర బృందం వివరించనుంది.

**డెస్క్**

-------------------------------

**మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి**

నల్లగొండ జిల్లాలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో కొత్తగా ఫార్మసీ కళాశాల మంజూరయిందని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు తన హయాంలో మంజూరైన ఈ విశ్వవిద్యాలయానికి కొత్త కోర్సులు కావాలని ప్రభుత్వాన్ని సంప్రదించిన వెంటనే ఫార్మసీల కోర్సులతో పాటు 50కి పైగా కొత్త పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు...

**బైట్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి**

**పీటీసీ - నల్గొండ**

----------------------------

**జూపల్లి పర్యటన**

ఆసిఫాబాద్ జిల్లాలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ రోజు పర్యటిస్తున్నారు. కాగజ్ నగర్ లో ఇటీవల పునర్ నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని మంత్రి ప్రారంభిస్తారు. వాంకిడి మండలంలోని బెండారలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేస్తారు. అలాగే ఆసిఫాబాద్ లో నూతనంగా నిర్మించే ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేసి, నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారు.

**డెస్క్**

------------------------

**డిజిపి శివధర్ రెడ్డి**

పోలీసులు తమ కుటుంబాలతో సంతోషంగా ఉండేందుకు కావలసిన వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో మామునూరు టిజిఎస్పి నాల్గవ బెటాలియన్ లో అధికారులకు, సిబ్బంది అవసరాలకు అనుగుణంగా నిర్మించిన నూతన నివాస గృహాలను, బెటాలియన్ల అదనపు డిజిపి సంజయ్ కుమార్ జైన్ తో కలిసి ప్రారంభించారు. బెటాలియన్లు పాత క్వార్టర్స్ స్థానంలో నూతన గృహాలు నిర్మించడం అభినందనీయమని డీజీపీ కొనియాడారు.

**పీటీసీ - వరంగల్**

-------------------------

**హరీష్ రావు..**

సింగరేణి నైని బ్లాక్ టెండర్ల వ్యవహారంపై మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కమీషన్ల వేటగా మార్చుకుందని ఆరోపణలు చేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే సరికొత్త నిబంధనను తీసుకువచ్చి, టెండర్ల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారన్నారు.  ఈ నిబంధన ద్వారా ఎవరు టెండర్ వేస్తున్నారో ముందే తెలుసుకుని, అధికార పార్టీ నేతలు వారిని బెదిరిస్తున్నారని అన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటోందని హరీష్ రావు ఆరోపించారు.

**HYD -PTC**

-------------------------

**సర్పంచుల శిక్షణా శిబిరం**

నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు ప్రజలకు మెరుగైన పాలన అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కోరారు. జిల్లాలో కొత్తగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ లకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు.  ఈరోజు నుండి ఫిబ్రవరి 28 వరకు విడతలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ  చెప్పిన విధంగా గ్రామాలు అభివృద్ధి చెందితేనే  దేశం అభివృద్ధి

చెందుతుందని, గ్రామాలలో ప్రజా సమస్యలు తీర్చడంలో,ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సర్పంచులది కీలకపాత్ర అని అన్నారు. చట్టపరంగా సర్పంచుల హక్కులు, బాధ్యతలు, వివిధ ప్రభుత్వ పథకాల వివరాలు సమగ్రంగా తెలుసుకొని ప్రజలకు సుపరిపాలన అందించాలని నూతన సర్పంచ్ లకు సూచించారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------

**నాగోబా జాతర...**

గిరిజనుల ఆచార వ్యవహారాలకు నాగోబా జాతర ఒక ప్రతీకగా నిలుస్తుందని నిర్మల్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర, పుష్యమాస అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నిన్న అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మెస్త్రం వంశీయులు పవిత్ర గంగాజలంతో నాగోబా దేవతకు అభిషేకం చేసి, కొత్త కుండల్లో వండిన నైవేద్యాలను సమర్పించి శాస్త్రోక్తంగా మహాపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రవాణా, పారిశుధ్యం, వైద్య శిబిరాల ఏర్పాటులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

**పిటిసి నిర్మల్**

----------------------------

**వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ముందుగా భక్తులు వేములవాడ రావడం ఇందులో భాగంగా నిన్న సాయంత్రం నుండి వేములవాడలో రద్దీ బాగా పెరగడంతో, ఆలయంలో 24 గంటల పాటు నిరంతర దర్శనం కల్పించారు. కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షణ చేపట్టారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

----------------------------

**ప్రధానమంత్రి NDRF**

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. విపత్తు సంభవించినప్పుడు బాధితుల ప్రాణాలను రక్షించడానికి NDRF సిబ్బంది అత్యంత సవాలుతో కూడిన పరిస్థితులలో అవిశ్రాంతంగా పనిచేస్తారని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ పోస్ట్ లో పేర్కొన్నారు. NDRF సిబ్బంది నైపుణ్యాలు, విధి భావం అత్యున్నత సేవా ప్రమాణాలకు ఉదాహరణగా నిలుస్తాయని ప్రధానమంత్రి అన్నారు.

**డెస్క్**

------------------------------